

పటిష్టంగా భూ రీ సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి -పొదలకూరు : పొదలకూరు మండలంలో 3వ దశలో ఎనిమిది గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సర్వే, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పొదలకూరు మండలంలో భూ సర్వే పై ఆర్‌డిఒ, తహశీల్దార్, సర్వే అధికారులతో సమీక్ష చేశారు. భూ సర్వే రికార్డులను తనిఖీ చేశారు. 9(2)నోటీసులు, కోరులేషన్ షీట్లు, చల్తా నెంబర్లు, సర్వే రికార్డులు నిశితంగా పరిశీలించారు. భూ సర్వే రికార్డుల నిర్వహణ లోటు పాట్లు గమనించిన కలెక్టర్ వాటిని సరిదిద్దుకోవాలని లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.రీసర్వే రికార్డ్ లను జాగ్రత్తగా భద్రపర చాలన్నారు. ఆర్డిఒ మలోల, తహశీల్దార్ వీర వసంతరావు, మండల సర్వేయర్ వెంకటస్వామి, రీసర్వే డ్యూటీ, సర్వే ఇనెస్పెక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి..!

- విద్యుత్ ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి..!
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- వామపక్షాల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంతోపాటు, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి సిపిఎం,. సిపిఐ, సిపిఐ,ఎంఎల్ న్యూడెమొక్రసీ నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ర్యాలీలో పాల్గొన్నారు. విఆర్‌సి, జెడ్‌పి కార్యాలయం మీదుగా కలెక్టర్ కార్యాల యం వరకు సాగింది. అక్కడ ధర్నా నిర్వహించారు. రాఘవులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా విద్యుత్ ఛార్జీలు పెంపుదలకు , స్మార్ట్ మీటర్లు బిగింపునకు వ్యతిరేకంగా వామపక్షాలు ఆందోళన నిర్వహిస్తు న్నాయన్నారు. పోరాటాల ద్వార రైతులకు ఉచిత విద్యుత్ సాధించుకున్నామన్నారు. బలహీనవర్గాలకు కాస్త తక్కువ ధరలకు విద్యుత్ అందేలా చూశామన్నారు. విద్యుత్ సంస్థలను పెట్టుబడిదారులు కొనుగోలు చేయడానికి చూస్తున్నారని, వారు కొనుగోలు చేయాలంటే భారీగా లాబాలు రావాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బిల్లులు వసూళ్ల విషయం చూసుకుంటుందన్నారు. వీటిని ప్రయివేటు సంస్థలు కొనుగోలు చేస్తే అందుకు భిన్నమైన పరిస్థితులు చూడాల్సి వస్తుందన్నారు. పెద్ద పెద్ద కంపెనీలు విద్యుత్ సంస్థలను కొనుగోలు చేస్తే, రైతులకు ఉచిత కరెంటు ఉండదన్నారు. బలహీనవర్గాలకు, పేదలకు చౌకగా సరఫరా చేసే విద్యుత్ కూడా రాదన్నారు. విద్యుత్ విషయంలో ప్రజలు ఇప్పటి నుంచే మేలుకోవాలన్నారు. అనేక చోట్ల విద్యుత్ కంపెనీలను ప్రవేటు వ్యక్తులకు అప్పగించారన్నారు. ప్రజలు అనేక బాధలు పడ్డారన్నారు. పోరాటం చేసి, మళ్లీ ప్రభుత్వమే విద్యుత్ సంస్థలను నడిపేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొస్తున్నారని, అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టమని చెబుతున్నారన్నారు. ఉచిత విద్యుత్ నిలిపివేయడంతోపాటు, బలహీనవర్గాలకు ఇచ్చి రాయితీలు కూడా లేకుండా చేయడానికి కేంద్రం చేస్తున్న పన్నాగాన్ని వైసిపి ప్రభుత్వం సమర్థిస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం మోడీకి లొంగిపోయిందన్నారు. చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను అణిచివేస్తుందని, మేధావులు, జర్నలిస్టులు, ఇతరులను అరెస్ట్ చేసి, జైల్లో పెడుతున్నారన్నారు. ఆనాడు చంద్రబాబు సిఎంగా ఉన్న సమయంలోనూ వాపపక్షాలపై ఇలాంటి స్థితినే కొనసాగించారని, ఇప్పుడు ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎవరు చేసినా తమ పార్టీ ఖండిస్తుందన్నారు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకోవచ్చునని, రాజకీయ కక్షలతో చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ రాష్ట్రనాయకులు జగదీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఎంఎల్ నేత కిషోర్ బాబు, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమొక్రసీ) నేత సాగర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, జొన్నలగడ్డ వెంకమరాజు, మూలి వెంగయ్య, కె.అజయ్‌కుమార్, గోగుల శ్రీనివాసులు, సిపిఎం నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌బీ, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిపిఐ నాయకులు అరిగెల నాగేంద్ర సాయి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతోన్న సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, తదితరులు

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి -పొదలకూరు

అర్జీదారులు సంతప్తి చెందేలా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్క రించడమే ధ్యేయంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం. హరి నారాయణన్ పేర్కొన్నారు. పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత అధికారులకు ఇచ్చి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్క రించాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 9 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారం భించిందని, అందులో భాగంగానే గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు పరి ష్కరించాలనే లక్ష్యంతో మండల కేంద్రాల్లో ముందుగానే షెడ్యూలు ప్రకటించి ప్రతి బుధవారం, శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జెడ్‌పి సిఇఒ బి చిరంజీవి, డిపిఒ సుస్మితా రెడ్డి, ఆర్‌డిఒ మలోల, డిఆర్డిఎ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, నుడా వి సి బాపిరెడ్డి, వెంకట్రావు, నాగరాజు, సర్వే రికార్డుల ఏడి హనుమాన్ ప్రసాద్, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డిఇఒ గంగాభవాని, సిపిఓ ఏఎస్ రాజు, పలువురు జిల్లా అధి కారులు, తహశీల్దార్ వీర వసంత కుమార్, ఎంపిడిఒ నగేష్ కుమారి ఉన్నారు.

టిడిపి, జనసేన నేతల భేటి..!

వామపక్షాలను, బిజెపిని కలుస్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తులో భాగంగా బుధవారం మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి టిడిపి బృందం జనసేన జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డితో భేటీ అయ్యారు..ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ పై చర్చించారు. సైకో పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు భవిష్యత్తులో జిల్లాలో కలిసి పోరాటాలు చేయాలని తీర్మానించారు. టిడిపితో కలిసి అడుగులో అగుడు కలుపుతామని, ప్రజా పరిరక్షణ కోసం పోరాడుతామని జనసేన నాయకులు ప్రకటించారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు లక్షల కోట్లు అవినీతి అని చెప్పి.. చివరకు కొండను తవ్వి ఎలుకను పట్టారు. జైల్లో చంద్రబాబును కలసిన పవన్ కళ్యాణ్ రీల్ హీరోనే కాదు.. రియల్ హీరో అని నిరూపించుకున్నారన్నారు. సోషల్ మీడియా ద్వారా చిచ్చు పెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపా డేందుకు రేపు వామపక్షలు, బిజెపిని కలుస్తామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఈ రోజు నుంచి కలసి పోరాడుతామని, ..నియంత పాలనకు బుద్ధి చెప్పేంత వరకు పోరాడుతామన్నారు. వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డితోపాటు జనసేన పార్టీ నేత మనుక్రాంత్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, రూరల్ టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జనసేన పార్టీ నగర అధ్యక్షులు సుజయ్ బాబు, కొట్టే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జనసేన నేతలను కలిసి టిడిపి నేతలు

30న ఎస్‌టి కమిషన్ సభ్యుల రాక

ప్రజాశక్తి-నెల్లూరు : ఎపి ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఈనెల 30న జిల్లాలో పర్యటిం చనున్నట్లు ఐటిడిఎ పిఒ మందా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ ఉదయం 10 గంటలకు ముత్తుకూరు మండలం పైనాపురంలో గిరిజనులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అదే రోజు ఉదయం 11.45 గంటలకు నేలటూరులోని ఎపి జెన్కో థర్మల్ పవర్ స్టేషన్ లో చీఫ్ ఇంజనీర్ తో సమావేశమై నేలటూరు కు చెందిన గిరిజన ఉద్యోగులు, ప్రజల సమస్యలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సైదాపురం మండలం పాలూరు రాజుపాలెం గ్రామంలో ఎల్లంపల్లి పెంచలయ్య మతి ఘటనపై విచారణ నిర్వహిస్తారని, సంభందిత అధికారులు హాజరు కావాలని మందా రాణి కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబ్‌నార్

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సాహిత్యం–భారత స్వాతంత్ర ఉద్యమం' అను అంశం మీద ఆంగ్లంలో ఆన్‌లైన్ వెబినార్ బుధవారం జరిగింది. కళాశాల ఆంగ్ల, అర్థ, చరిత్ర ,రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఈ వెబినార్ నిర్వహించారు. భగత్ సింగ్ జయంతి ,గాంధీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రారంభ ఉపన్యాసం చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవి కుమార్ సాహిత్యం ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు గ్రంథాల యానికి వెళ్లి పుస్తకాలను అధ్యయనం చేసి దేశ స్వాతంత్రం గురించి త్యాగ ధనుల జీవితాల గురించి తెలుసుకోవాలని కోరారు. అనంతరం ఈ వెబినార్ ముఖ్య వక్త , ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ప్రొఫెసర్ పుసులూరి శ్రీహరి మాట్లాడుతూ సాహిత్యం, వివిధ దేశాల్లోని ప్రజా ఉద్యమాల్ని, స్వాతంత్ర ఉద్యమాల్ని ఎలా ప్రభావితం చేసిందో వివరించారు. డాక్టర్ పి. రాజగోపాల్, డాక్టర్ ఐ. కేశవరావు, కె. నరేష్ రాజా, డి రామాం జనేయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో దశలో డిగ్రీ ప్రవేశాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. కళాశాలలో బిఎ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, స్పెషల్ తెలుగు, బిఎస్‌షి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్ గ్రూపులలో మిగిలిన సీట్లకు మూడో దశలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ఈనెల 27 నుంచి కలశాలకు వెళ్లి చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94401 81727 , 9440221228 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పొగాకు రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు 26వేలం కేంద్రంలోని పరిధిలోని దూబగుంట, వెంపాడు గ్రామాల్లో పొగాకు పంట నియంత్రణపై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. వేలం నిర్వహణ అధికారి చైన్ రామ్ మీనా మాట్లాడుతూ పొగాకు బోర్డు అనుమతి మేరకే తేలిక పాటి నేలలకు బ్యారన్‌కు 2.90 హెక్టార్ల వరకే పొగాకు సాగు చేయాలన్నారు. బ్యారన్‌ఖు 3650 కిలోల పొగాకు మాత్రమే పండించాలని సూచించారు. పోగాకు బోర్డు అనుమతి లేకుండా కొత్త బ్యారన్ లు కట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటీసీ మనేజర్ ప్రవీణ్ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు పచ్చి రొట్ట ఎరువులు వేసి దిగుబడి పెంచుకోవచ్చు అని సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ ఉపేంద్ర మాట్లాడారు. పొగాకు బోర్డు సిబ్బంది, పొగాకు రైతులు పాల్గొన్నారు.

ఐక్యతా విజయపథం ర్యాలీ

ప్రజాశక్తి-గుడ్లూరు : పేదల ఐక్యమత్యమే ధ్యేయంగా ఐక్యత విజయ పథం పేరుతో మాజీ ఐఎఎస్ విజయ్ కుమార్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాత్రి గుడ్లూరు చేరింది. ప్రచార జాత గుడ్లూరు చేరుకోగానే ఎస్‌సి కాలనీ వాసులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రచార జాత స్థానిక బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన వేదికపై విజయ్ కుమార్ ప్రసంగం జనాన్ని ఆకట్టుకుంది. పేదరికం నిర్మూలన కోసం ఐదు అంశాలతో పాంప్లెట్లు స్థానిక కార్యకర్తల ద్వారా పంపిణీ చేశారు. ఐక్యత విజయ్ పదానికి అందరూ సహకారం అందించాలన్నారు. భూమిలేని పేద కుటుంబాలకి భూములు పంపిణీ చేసేందుకు కషి చేస్తామన్నారు లక్షలాది మంది నిరక్షరాశులకి ఉపాధి కల్పించేందుకు పనిచేస్తామన్నారు. నిరక్షరాస్టులలో అక్షర జ్యోతిని వెలిగించి చైతన్యం తీసుకువస్తామన్నారు.

జీవితా బీమా నమోదు

ప్రజాశక్తి-ఉలవపాడు : ఉలవపాడు సచివాలయం –3 పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు బుధవారం జీవిత బీమా నమోదు కార్యక్రమం చేపట్టారు. మండల జే సి ఎస్ కన్వీనర్ వెలిచెర్ల ధనుకోటి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి సారథులైన సచివాలయ కన్వీనర్లు, గహ సారథులకు జీవిత బీమా పథకం ఉపయోగపడుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. స్థానిక సర్పంచి మానికల నాగలక్ష్మి ,సచివాలయ కన్వీనర్లు దాసరి రాము, రాయపాటి శివ, ఆదిలక్ష్మి ఉన్నారు.

గుడ్లూరులో చిరుజల్లులు

ప్రజాశక్తి-గుడ్లూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గుడ్లూరు లో బుధవారం మధ్యాహ్నం 3:00 నుంచి 4:00 వరకు చిరుజల్లులు వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల కూరగాయల సాగు, పంటలకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. తీవ్రమైన ఎండ ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. కూరగాయల సాగు రైతులు ఆకుకూరలు సాగు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు మద్దతుగా కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కందుకూరు నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరాయి. బుధ వారం దీక్షలో నియోజవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయ కులు, కార్యకర్తలు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మాట్లాడారు. దీక్ష ముగింపు సందర్భంగా దీక్షలో ఉన్న నాయ కులకు టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమిం పచేశారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు మాజీ చైర్మన్ ఘట్టమనేని చెంచు రామయ్య, నాదెళ్ల వెంకట సుబ్బారావు, చెరువుపల్లి మాల్యాద్రి, కూనం నరేంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, చుండూరి శీను, యర్ర ముసలయ్య, రాచగర్ల శివ, ముతకని బ్రహ్మయ్య, సుబ్బారెడ్డి, ముళ్లపాటి మహేష్, నాళం పరమేశ్వరరావు, జనార్ధన్ ఉన్నారు.

తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో జగన్ అరాచక, అణచివేత ప్రభుత్వా నికి ప్రజలు చరమగీతం పాడటం ఖాయమని మాజీ మంత్రి సో మిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు. మండలంలోని వరకవిపూ డి గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు సన్నారె డ్డి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం "మేము సైతం బాబు కోసం" కార్యక్రమాన్ని పురస్కరించు కొని రిలే నిరాహార దీక్షలు జరిగాయి. చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సం దర్భంగా అయన మాట్లాడుతూ స్కిల్ డెవల ప్మెంట్ కేసులో ఎలాంటి అవినీతి జరిగ లేదన్నా రు. ఈ మేరకు ఆ సంస్థకు చెందిన పలువురు ఈ విషయమై వాస్తవాలు చెబుతున్నప్పటికీ సి ఐడి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుపై తప్పుడు కేసులు బనాయిం చిందని సోమి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ము త్యాల శ్రీనివాసులు, టిడిపి నేతలు సోమిరెడ్డి శ్రీ నివాసుల రెడ్డి, వరిగొండ చినబాబి రెడ్డి, తిరుప తి పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి కొనతం రఘు బాబు, రైతు విభాగం రాష్ట్ర నేత రావూరు రాధా కష్ణమనాయుడు, మావిళ్ళపల్లి శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, సర్పంచ్ ఇంగిలాల వెంకట చైతన్య కుమార్, రై తు నాయకులు రావూరు రాధాకష్ణమ నాయు డు, ఆవుల మునిరత్నం, చింతా సీతారామ య్య, గోపాల్ నాయుడు, చుక్కపల్లి మలి ్లకార్జున్, ఎస్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నెల్లూరులో...

లింగసముద్రం : చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ బుధవారం మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు తాళ్ళూరి ముసలయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ మీరావళికి వినతిపత్రం అందజేశారు.చంద్రబాబు నాయుడుని ప్రభుత్వం రాజకీయంగా అణిచివేయాలని అక్రమ కేసుపెట్టి ఇబ్బందులు పెడుతుందని టిడిపి నేతలు విమర్శించారు. ఈ కార్యక్ర మంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి, టిడిపి నాయకులు అంగులూరి కొండయ్య,చిరుతోటి బాలకోటయ్య, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ : నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు ఖండిస్తూ మహిళలు గర్జించారు. కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టి ప్లే కార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జగన్ ప్లే కార్డును చెప్పులతో తొక్కుతూ మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరు నగరం టిడిపి కార్యాలయం వద్ద మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు తెలుగు మహిళలు వినూత్న నిరసన తెలియజేశారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల పట్ల కంసుడిగా తయారయ్యాడని మహిళలు మండిపడ్డారు. అక్రమంగా చంద్రబాబుపై కక్షతోనే అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైసి పికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చ రించారు.

'ప్రకాశం'కు యుజిసి అటానమస్ హోదా

ప్రజాశక్తి-కందుకూరు

సాధించడం ఒక విజయమైతే.. దానిని సక్రమ నిర్వహణతో విజయ పథం లో నడిపించడం ఓ సవాల్ అని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యు. జి.సి.) బుధవారం తమ కాలేజీకి అటానమస్ గుర్తింపునిచ్చిన సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తమతో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బందిపై కూడా ఈ గుర్తింపు బాధ్యతలు పెంచిందని గుర్తిం చుకోవాలన్నారు. యుజిసి గుర్తింపు సాధించడంలో అందరూ సమిష్టిగా ఎంతో కీలకంగా వ్యవహరించి ఈ విజయాన్ని సాధించామని అభినందించారు. డైరెక్టర్ డాక్టర్ కే.విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి అందరం సాధించుకున్న అటానమస్ గుర్తింపును విద్యార్థులకు బహుళార్థకంగా ఉపయోగించాలని కోరారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రవికుమార్ మాట్లాడుతూ కరస్పాండెంట్ దీర్ఘకాల ఆకాంక్ష నెరవేరిన రోజు అందరికీ పండుగేనని అభివర్ణించారు. వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, అకడమిక్స్ ఇన్‌చార్జి ఎస్.ఎన్.మీరావలి, అకడమిక్స్ సహాయకులు జి.ప్రసాద్,సిఎస్ఇ హెచ్ఒడి రాయుడు, ఎంబిఎ ఐసి డాక్టర్ పావని, ఫస్ట్ ఇయర్ హెచ్ ఓ డి డాక్టర్ సూరియా, అడ్మిషన్స్ ఐసి డి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఈమెయిల్ సమాచారం అందగానే విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

కేక్ కట్ చేస్తున్న కంచర్ల రామయ్య

సచివాలయంలో రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి - లింగసముద్రం

లింగసముద్రంలోని ఒకటో సచివాలయంలో కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక బుధవారం తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన ఆమె రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సకాలంలో విధులకు హాజరకావాలని, అందరూ యూనిఫాం ధరిం చాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ సేవలను పెం చాలని చెప్పారు. సచివాల యంలో పనిచేసే సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాల న్నారు. వివిధ పనులు కోసం వచ్చే వారి పనులను సాధ్యమై నంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.తహశీల్దార్ మీరావళి,ఎంపిడిఒ శేషు బాబు,రీ సర్వే డిటి ప్రసాద్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

యువతి కిడ్నాప్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక పొదలకూరు రోడ్డు, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని కారులో ఓ వ్యక్తి తరలించడం నగరంలో కలకలం రేపింది. బుధవారం బిటెక్ చదువుతున్న తమ కుమార్తెను విజయ్‌కుమార్ అనే యువకుడు కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడంటూ ఆ విద్యార్థిని తల్లిదండ్రులు వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని వెంగళాపురం గ్రామానికి సమీపంలో ఉన్న పొలాలకు దగ్గరలోని చిల్లచెట్లలో పేకాట ఆడుతున్నట్లు ఎస్ఐ బాజీబాబుకు సమాచారం రావడంతో బుధవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను తన సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వీరి వద్ద రూ. 10850 నగదు స్వాధీనం చేసుకొని వారి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

'బాబుతో నేను' కరపత్రాలు ప్రతి ఇంటికీ చేరాలి..

2న శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయించిందని ప్రజలకు వివరించేందుకు బాబుతో నేను కరపత్రాలు ప్రతి ఇంటికీ చేర్చి ప్రజలను చైతన్య పరచాలని మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి , ఆనం రామనారాయణ రెడ్డిలు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని టిడిపి కార్యాలయంలో పార్లమెంటు టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జిల్లా ముఖ్య నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర పిలుపుమేరకు జిల్లాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. బాబుతో నేను కరపత్రాలు ప్రతి ఇంటికీ చేరాలని నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు సూచించారు. అక్టోబర్ 2న ఉమ్మడి నెల్లూరు జిల్లాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ మంత్రులు తాళ్లపాక రమేష్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, కుంభం విజయరామిరెడ్డి, కావలి నియోజవర్గ ఇన్చార్జి మాలపాటి సుబ్బరాయుడు, నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నేతలతో చర్చిస్తున్న మాజీ మంత్రులు సోమిరెడ్డి, ఆనం

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో

భగత్ సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని పలు డివిజన్లలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 116వ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.బుధవారం స్థానిక 6,16,47 డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పి నరసింహా, ఎం.వి.రమణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొని స్వతంత్రం కోసం అతి చిన్న వయసులో 23 ఏళ్లకే ఉరి కంబాన్ని ముద్దాడిన నాయకుడు భగత్ సింగ్ అని కొనియాడారు. బ్రిటిష్ వాళ్ల పరిపాలిస్తున్న భారతదేశంలో ప్రతి ఒక్కరికి విద్య ఉపాధి కావాలని పోరాటం చేసిన మహోతన్నతమైన వ్యక్తి భగత్ సింగ్ అన్నారు. అటువంటి మహనీయుల జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించి మతవాదులచరిత్రను, మూఢనమ్మకాలకు చెందిన అంశాలను పాఠ్య పుస్తకాల్లో చేర్చి బోధించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం శోచనీయమన్నారు. . నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని వారి జీవితాలకు బంగారు బాటలు వేసుకుంటూ దేశాభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందించాలన్నారు. భగత్ సింగ్ అతి చిన్నవయసులో బ్రిటిష్ వాళ్ళ వ్యతిరేకంగా పోరాటం చేసిన దేశ భక్తుడన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం వెంటనే భర్తీ చేయాలని పెద్ద ఎత్తున పోరాటం చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. నగరంలో ఇటీవల పెరుగుతున్న రౌడీయిజానికి వ్యతిరేకంగా యువతను మంచి మార్గం వైపు నడిపించేలా ప్రభుత్వం ప్రధాన బాధ్యత తీసుకొని అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు జగదీష్ శేఖర్ రాయుడు కుమార్ వెంకటేష్ సతీష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కాంట్రాక్టు ఉద్యోగుల సంబరాలు

నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసేందుకు అవసరమైన బిల్లుకు ఆమోదం తెలియజేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు సంభరాలు జరుపుకున్నారు. బుధవారం స్థానిక సంతపేట ప్రాంతంలోని ఓ ప్రయివేట్ భవన్‌లో ఎపిజిఈఎఫ్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రెగ్యులరైజేషన్ కోసం 20 ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల కలల సాకారం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోష కరమన్నారు. ఎపిజిఈఎఫ్ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో కీలక భూమిక పోషించారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల కల సాకారం చేసిన సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఎపి జిఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్ రావు జిల్లా జనరల్ సెక్రెటరీ దేవి రెడ్డి రమణారెడ్డి కతజ్ఞతలు తెలిపారు. జిడబ్ల్యూఎస్ఈఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి హరీష్ రెడ్డి, ఎపిజిఈఎఫ్ జిల్లా ట్రెజరర్ బాలరాజన్, వైస్ ప్రెసిడెంట్ కర్లగుంట మల్లికార్జున, షేక్ ఖాలీద్, సుహంత్ రెడ్డి నాయకులు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగ సంఘం నాయకులు వెంకటేశ్వరరావు సంజీవ్ కుమార్, ట్రెజరీ నాయకులు రెహమాన్ ఉన్నారు.

విజయడెయిరీలో సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కోవూరు

మండల పరిధిలోని పడుగుపాడు గ్రామంలో కామేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్(నెల్లూరు విజయ డెయిరీ) సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్ అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పాడి రైతులకు మేలు చేసేందుకు అవసరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సహకారంతో నెల్లూరు విజయ డెయిరీని లాభాలబాటలో ముందుకు తీసుకెళ్లేందుకు తగిన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామన్నారు. విజయ డెయిరీ సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన కొండ్రెడ్డి రంగారెడ్డిని రైతులు, సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం 10 డైరెక్టర్ పదవుల్లో మూడు ఖాళీగా ఉండగా వాటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్లు సీహెచ్ కష్ణారెడ్డి, సుబ్బ రాయుడు, భవానీరెడ్డి, ఎన్. దశరధరామిరెడ్డి, సునీల్ రెడ్డి, హరిచంద్రారెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్ఎస్ఆర్'కు అటానమస్ హోదా

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు యుజిసి న్యూఢిల్లీ వారిచే అటానమస్, స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు కళాశాల ఛైర్మన్, కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు ఈ సంవత్సరం మార్చిలో యుజిసి నాగ్, ఎన్ఎబిఎ వారిచే ఏ గ్రేడ్ ద్వారా ఉత్తమ గుర్తింపు పొందినట్టు తెలిపారు. ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో 10 సంవత్సరాల వరకు అటానమస్ హోదా లభించడంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. అటానమస్ హోదాతో సొంత పాఠ్య ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, పరీక్షలు నిర్వహించుకోవడం, డిగ్రీలు ప్రదానం చేయడంతో పాటు మరింత మెరుగైన విద్యా బోధన, నూతన కృషితోపాటు తమ వ్యవహారాలను నిర్వహించుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ హోదాతో బహుళ జాతి కంపెనీలు విస్తృతంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం 2023 - 2024 ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులకు ఈ అటానమస్ హోదా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.రామా రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎస్ రెడ్డి, పరిపాలన అధికారి శ్రీ ఆర్వి రమణారెడ్డి, విభాగాల అధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వహీదాకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు

- హర్షం వ్యక్తం చేసిన కావలి ఉమెన్ ఫోర్స్

ప్రజాశక్తి-కావలి : ప్రముఖ హిందీ చలనచిత్ర నాయికమణి, పద్మభూషణ్ వహీదా రెహమాన్‌ను ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక చేయడం ఆ అవార్డుకే గర్వకారణమని కావలి ఉమెన్ ఫోర్స్ హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో కావలి ఉమెన్స్ ఫోర్స్ బాధ్యులు సి.శారద(కన్వీనర్), ఎస్.ప్రభావతి(ప్రెసిడెంట్), పార్వతీశంకర్, విద్యావతి, అరుణ (ఉపాధ్యక్షులు), పాతిమా, జమీమ్, నూర్జహాన్, సుజాత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి : మొహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా బుధవారం కావలి పట్టణం వైకుంఠపురం మదీనా మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరు ముస్లిం అబ్దుల్ హాఫ్ సాబ్ ప్రార్థనలతో శిబిరం ప్రారంభమైంది. డివిజన్ హాజీ ముప్తీ ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో వైకుంఠపురం మదీనా కమిటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ తమ సంస్థ ముఖ్య ఉద్దేశం ప్రేమ, సోదరభావం, మానవ విలువలు, మానవ జాతికి తెలియజేసి కుల మతాలకతీతంగా మనిషితో మనిషిని హృదయంతో హృదయాన్ని కలపడమే ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ఈ శిబిరంలో 80 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ షేక్ వలీ మౌలాలి, డాక్టర్ షేక్ అక్బర్ షాష్, డాక్టర్ ఎ.ఉమాచంద్, డాక్టర్ కె.ఆనంద్ కుమార్, డాక్టర్ సయ్యద్ మొయినుద్దీన్, మొహమ్మద్, సాదిక్ హుస్సేన్, రెడ్‌క్రాస్ ముఖ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, ధనరాజు రవిప్రకాష్, పట్టణ ముస్లిం ప్రముఖులు మొగల్ సలీంబేగ్, షేక్ అబ్దుల్ రషీద్, పఠాన్ నవాజ్ ఖాన్, షేక్ నాయబ్ రసూల్, సర్దార్ కిర్మిణీ, షేక్ దస్తగిరి, షేక్ కరిముల్లా, షేక్ బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని బోయలచిరువెళ్ల గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ జబాక్ ప్రవీణ్ బుధవారం సచివాలయం తనిఖీ చేశారు. సిబ్బందికి, వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బుధవారం నుండి ఇంటింటి సర్వే ప్రారంభించమని తెలియజేశారు. నూతన గ్రామ సచివాలయాన్ని సందర్శించి పనులను ప్రారంభింపచేయాలన్నారు. మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి బాలబాలికలకు ఇంగ్లీష్ భాషలో వారికి ఉన్న అవగాహనను పరిశీలించారు. కార్యక్రమంలో బోయిలచిరువెళ్ల సర్పంచ్ బొల్లిగొర్ల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద హెల్త్ కేర్ సెంటర్ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామంలో గత ఐదు రోజులుగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రోగులకు ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని సిహెచ్‌ఒ సింధు, ఎఎన్ఎం నాగమణి తెలిపారు. పరీక్షలు అనంతరం బోకోస్ చేసి, ఆన్‌లైన్ చేస్తారు. అక్టోబర్ 9వ తేదిన జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యులతో ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని కొత్తపల్లి, రాజువారి చింతలపాలెం గ్రామాల ప్రజలు ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కృష్ణవేణి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను విజయవంతం చేయాలని సచివాలయాల కన్వీనర్ కవరగిరి ప్రసాద్ తెలిపారు. మండలంలోని పాటూరు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి పేదవానికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుబాటులో ఉండాలనే ఆశయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మారుమూల పల్లెలకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కోవూరు ప్రభుత్వ ఆసుపత్రిని మెరుగైన సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేశారన్నారు. వేసవికాలంలో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు చూసి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 3 ఏసీలను అందజేసిన పేదల పక్షాన తన దాతృత్వాన్ని చాటుకున్నారని తెలియజేశారు.

పూజారిపై దాడి చేసిన ఇఒపై కేసు

ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల పరిధిలోని రుద్రకోట గ్రామంలో అంకమ్మ పరమేశ్వరి ఆలయంలో ఆలయ పూజారి బాలకోటయ్యపై దాడి చేసిన ధర్మకర్త అయ్య నారాయణరెడ్డిపై బుధవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు మేరకు.. ఆలయం తాళాల కోసం పూజారి బాలకోటయ్య మంగళవారం ధర్మకర్త నారాయణరెడ్డి ఇంటి వద్ద గుడి తాళాలు తీసుకున్నట్లు తెలిపారు. వాటిలో రెండు తాళాలు లేవని ధర్మకర్తను పూజారి ప్రశ్నించగా కోపోద్రిక్తుడైన ధర్మకర్త పక్కనే ఉన్న రాయి తీసుకొని దాడి చేశాడు. దాంతో గాయపడిన పూజారి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విట్స్‌లో సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - కావలి : స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.జె.మధుకర్ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ జె.కృష్ణచైతన్య "గుండెపోటు వచ్చిన వ్యక్తికి సత్వరమే స్పందించడం ఏమి విధానాల ప్రథమ చికిత్సలు చేయవచ్చో, అంబులెన్స్ వచ్చేలోగా ఎలా బతికించుకోవచ్చో తెలియజేసి, సిపిఆర్ చేసే పద్ధతిని వివరించారు. మోడల్ బొమ్మలతో సిపిఆర్ చేసేపద్ధతిని విద్యార్థులతో చేయించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఈ విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మెడికవర్ హాస్పిటల్ అసోసియేట్లు సురేష్‌కుమార్, ప్రసన్నకుమార్, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించినందుకు కళాశాల ఛైర్మన్ దొడ్ల విద్యాధర్ కుమార్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ప్రత్యూషారెడ్డి తమ సంతోషం వ్యక్తం చేశారు.

అసైన్డ్‌మెంట్ చట్టానికి తూట్లు

ప్రజాశక్తి-బిట్రగుంట

జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళిత, గిరిజన సంక్షేమ పథకాలతో పాటు చట్టాలను కూడా రద్దు చేసుకుంటూ పోతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. బోగోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో దళిత, గిరిజనులకు సంబంధించిన అసైన్డ్‌మెంట్ చట్టం 1/77 ద్వారా ఇందిరాగాంధీ బడుగు వర్గాల భూములకు రక్షణ కల్పించడమే కాకుండా అవి అమ్మిన కొన్నా చెల్లవని చట్టం పటిష్టంగా చేశారన్నారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం అసైన్డ్‌మెంట్ చట్టాన్ని 75శాతం నిర్వీర్యం చేశారని తెలిపారు. ఎవరి చేతుల్లో భూములు ఉంటాయో 20 సంవత్సరాలు అనుభవం ఉంటే ఆ భూమి వారికి సర్వ హక్కులు ఉంటాయని, 10 సంవత్సరాలు ఇంటి స్థలం ఎవరైనా కొనుక్కుంటే వారిదే అవుతుందని ఇంకా

ధర్నా చేపడుతున్న దళితులు

అనేక సమస్యలతోటి అసైన్డ్‌మెంట్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తెలియజేశారు. అసైన్డ్‌మెంట్ భూములను అగ్ర కులం వారి పరం చేయడం పేద వర్గాలను అణగతొక్కడం దళిత గిరిజనులకు భూమిపై హక్కు లేకుండా చేయడం భూహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయడం దారుణమైన విషయమన్నారు. జగనన్న ఇచ్చే ఒక్కొక్క కానుక వల్ల జగనన్న దళిత గిరిజనకు దిమ్మతిరిగేలా చేస్తున్నారని ఎస్సి, ఎస్‌టి కార్పొరేషన్ రద్దు చేయడం కేంద్రం దళితుల అభివృద్ధికి ఇచ్చే నిధులు, ఎస్సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు తమ వర్గానికి కాంట్రాక్టు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విధంగా పేద వర్గాలకు సంబంధించిన చట్టాలను, కార్పొరేషన్ రద్దు చేసి కానుకల మీద కానుకలు ఇస్తున్నారని, దళిత గిరిజనులను ఆర్థికంగా అణిచివేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, భూ సమస్యలపై ఇప్పటివరకు పట్టించుకోకపోవడం వల్ల ఆ భూములన్నీ తన కులం వారికి పోతున్నాయని తెలియజేశారు. ఇక భూమిపై దళితులకు గిరిజనులకు హక్కు లేకుండా చేయడమే దారుణమైన విషయమని అసైన్డ్‌మెంట్ చట్టాన్ని యథాప్రకారం ఉంచాలని ఇంకా పదున్కైన చట్టాన్ని తెచ్చి దళిత భూములకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, దుగ్గిరాల రవి, దుగ్గిరాల చంద్రబాబు, వెంకటేశ్వర్లు, వెంకయ్య, మోహన్‌రావు, ఆత్మకూరి తేజ, ఆనందం, శ్రీనివాసులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్మకుకూరు అర్బన్

పట్టణంలోని జెడ్‌పి బాలు ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష స్కూల్ స్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా గత రెండు రోజుల నుండి పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు సుమారు 350 మందికి డాక్టర్ ఆర్ వినోద్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తారని డాక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు రత్నం, ఆశా వర్కర్లు రమణమ్మ, కాంతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాషువా చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి-మర్రిపాడు



నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించు కొని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైసిపి మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, గ్రంథాలయ భాండాగారి నారాయణరావులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అవమానాలనే గెలుపునకు సోపానంగా చేసుకొని కాలాన్నే ఆయుధంగా మలచుకొని చీత్కారాలు ఎదురైన చోట సత్కారాలు పొంది పద్మభూషణ్ లాంటి ఎన్నో బిరుదులు పొందిన కవిదిగ్గజం గుర్రం జాషువా అని కొనియాడారు. వడగాల్పు నా జీవితం వెన్నెల నా సాహిత్యం అంటూ పేదరికం, వర్గ, సంఘర్షణ, ఆర్థిక అసమానతలపై పోరాడిన అభ్యుదయవాది గుర్రం జాషువా అన్నారు. నాటికి నేటికి సమాజంలో పరిస్థితులు మారాయని మనుషులంతా ఒక్కటేనని ఈ మార్పులు విద్య ద్వారా జరిగాయని వారు అభిప్రాయపడ్డారు. కుల మతాలు అంటరానితనం లాంటి మూఢాచారాలు తగ్గి అందరూ ఒక్కటేనని ప్రజలు తెలుసుకుంటున్నా రన్నారు. రాష్ట్ర క్రీడాభివృద్ధి శాప్ సంస్థ డైరెక్టర్ కాలువ నర్సింహులు జాషువా రచించిన గబ్బిలం కావ్యం నుండి పద్యాలను అద్భుతంగా పాడి అందరిని ఆకట్టుకున్నారు. శాప్ డైరెక్టర్‌కు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయినులు భాగ్యలక్ష్మి, కళ్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆత్మకూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం వాయిదా పడింది. ఈ సందర్భంగా అధికారులు మున్సిపల్ కౌన్సిల్‌లోని అజెండాలోని అంశాలను చదివి వినిపించి, సమావేశాన్ని నిర్వహించాలను కున్న తరుణంలో కౌన్సిల్ సభ్యులు సహచర 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి ఇటీవల మృతి చెందారని, ఈ సమావేశాన్ని సంతాప సభగా మార్చి కౌన్సిల్ సమావేశంలో వచ్చే వారంలో నిర్వహించుకుందామని చెప్పడంతో కౌన్సిల్ సమావేశం సంతాప సభగా మారింది. దాంతో 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కమిషనర్, ఇతర సిబ్బంది నివాళు లర్పించారు. వార్డు సభ్యురాలిగా ఎన్నికైన నాటినుంచి వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆమె మృతి చెందడం బాధాకరమని, కౌన్సిల్ పాలకవర్గం తరఫున సంతాపం తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ బి. నాగేశ్వరరావు మున్సిపల్ వైస్ ఛైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి రిలే దీక్ష

ప్రజాశక్తి-కావలి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, నియోజకవర్గ టిడిపి కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో కాపు సంఘ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గంలోని పార్టీ కుటుంబ సభ్యులందరూ బుధవారం 14వ రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. దీక్ష శిబిరంలో ముందుగా సుబ్బానాయుడు మాట్లాడుతూ 45సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడును అక్రమంగా అవినీతి చేశారంటూ ఆరోపిస్తూ, అరెస్టు చేయడం చాలా దౌర్భాగ్యమన్నారు. ఈ నాలుగున్నర సంవత్సర కాలంలో టిడిపి నాయకులను, కార్యకర్తలను తప్పుడు కేసులు బనాయించి, హింసించడమే లక్ష్యంగా జగన్ మొండి ప్రభుత్వం ప్రవర్తిస్తుందని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అంతటికీ ప్రతిఫలంగా జగన్‌కు జీవితకాలం జైలు ఖాయమని హెచ్చరించారు. దీక్షలో పాల్గొన్న నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర మాట్లాడుతూ సంక్షేమం అంటే గుర్తొచ్చేది టిడిపినే అని అన్నారు. కాపులకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.1000 కోట్లు మంజూరు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. అలాగే 5శాతం రిజర్వేషన్ కల్పించారని, ఇప్పటి వైసిపి ప్రభుత్వం ఆ 5శాతం క్యాన్సిల్ చేసిందని తెలియజేశారు. ఒక్క కాపులకే కాకుండా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ఘనత టిడిపిదే అని అన్నారు. ప్రస్తుతం కక్ష ధోరణితో జరుగుతున్న కార్యక్రమాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, వీటిని ఖండించే సమయం ఆసన్నమైందని ప్రజలకు పిలుపునిచ్చారు. తదుపరి రాష్ట్ర టిడిపి కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంబంధం లేని

దీక్ష చేపడుతున్న టిడిపి నాయకులు

కేసులో చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఈ సంఘటనకు తప్పకుండా జగన్‌కు రిటన్ గిఫ్ట్ ఉంటుందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రాన్ని మరొక బీహార్‌గా మారుస్తున్న సిఎంకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. తిరిగి లోకేష్‌బాబు యువగళం పాదయాత్రను మొదలు పెడుతున్న విషయాన్ని జీర్ణించుకోలేక, లోకేష్‌బాబుపై కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ఎంతమందిని అరెస్టు చేసినా బంతిలా పైకి లేచి వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. టిడిపికి సంక్షోభాలు కొత్తవి కాదని, ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కాక కావలి నియోజకవర్గంలో చూస్తే కాపులను అభివృద్ధి చేసిన ఘనత టిడిపిదే అని పేర్లతో సహా వివరించారు. స్థానిక ఎంఎల్ఎ కాపులకు చేసిందేమీ లేదని, కావలి నియోజక వర్గంలో ఎంతోమంది ఎంఎల్ఎలు పనిచేశారని, కేవలం సంపాదనే ధ్యేయంగా పనిచేసిన ఎంఎల్ఎ రామిరెడ్డి అని ధ్వజమెత్తారు. ఎంఎల్ఎ ఏదైనా అభివృద్ధి చేసి ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఈ దీక్షకు సంఘీభావంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు, అనేకమంది కాపు నాయకులు కదలి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన బోర్డుపై సంతకాలు చేసి కార్యక్రమాన్ని ముగించారు.

క్వాలిటీ కంట్రోల్ బృందం పర్యటన

ప్రజాశక్తి-ఉదయగిరి

తిరుపతి క్వాలిటీ కంట్రోల్ అధికారి వెంకట సుబ్బరామయ్య గండిపాలెం జలాశయం ఇరిగేషన్ శిథిలావస్థ భవనాలు గ్రామ కొలనుల పనులపై సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం పట్టణంలోని ట్యాంక్‌బండ్ సమీపాన నిర్మాణంలో ఉన్న గ్రామ కొలను అభివృద్ధి పనులను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామకొలను కరకట్టలను, రాతి కట్టడాల నిర్మాణాలను దృఢంగా నిర్మించాలని పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ అక్కి భాస్కర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం శిథిల వ్యవస్థలో చేరుకున్న ఇరిగేషన్ శాఖ భవనాలను పరిశీలించారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఈఈ మాట్లాడుతూ గతంలో భవనాల మరమ్మతులకు ఆర్అండ్‌బి ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు. అనంతరం గండిపాలెం జలాశయం క్రాఫ్ట్ గేట్లకు సంబంధించి పెయింటింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్‌కు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కరకట్టలకు మొత్తం జంగిల్ క్లియరెన్స్ చేయాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ డిఇ రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎఇలు చంద్రమౌళి, వేణు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విద్యార్థులు క్రమశిక్షణ గల విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ఎఎస్ఆర్ కళాశాల కరెస్పాండెంట్ ఎం.సుబ్బారెడ్డి అన్నారు. బుదవారం ఎఎస్ఆర్ కళాశాలలో తొలి సంవత్సరం డిగ్రీ చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశలకు జీవం పోస్తూ కళాశాలలోని ఉపాధ్యాయ సిబ్బందితో ప్రతి ఒక్కరూ బాగా చదువు

కోవాలని, తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డి.ప్రసాద్, ప్రెసిడెంట్ ఎ.సురేంద్రరెడ్డి, పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్లో నిర్వహించే మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపించిందని స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లికార్జున ఆరోపించారు. బుధవారం గవర్నమెంట్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 20వ వార్డ్ కౌన్సిలర్ సురా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ భోజనం తయారీ కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారని, అలా చేయడం సరిగా లేదన్నారు. నాసిరకం కూరగాయలు నాసిరకం వస్తువులు వంటలతో విద్యార్థులకు ఇబ్బంది కలిగించకూడదని వారికి చూపించారు. మధ్యాహ్నం భోజనం పథకం విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించడమే ఉద్దేశంతో ప్రభుత్వాలు ప్రారంభించాయని దానికి భిన్నంగా ఇక్కడ ఉందని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా వారి శారీరక ఎదుగుదలకు తోడ్పాటు అందించాల్సింది పోయి నాణ్యతలేని భోజనం వడ్డించడం సరికాదన్నారు.

మాలినిదేవి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

స్థానిక క్రిస్టియన్ పేట 5వ లైన్లో బుధవారం నూతనంగా "మాలినిదేవి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల"ను కురువృద్ధుడు దేవరపల్లి వెంకారెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఆయనతోపాటు డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు, డాక్టర్ బెజవాడ రవికుమార్, గోసల గోపాల్ రెడ్డి మాలిని వైద్యశాల డాక్టర్లు బత్తిన నరేంద్రబాబు, గొట్టిపాటి మాలినీదేవి, "మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్"ను కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు వైద్యశాలలోని పలు ముఖ్యమైన బ్లాక్‌లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ

పాల్గొన్న అతిరథ మహారథులు

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న దేవరపల్లి వెంకారెడ్డి

కావలి పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ వైద్యశాలలో తక్కువ ఖర్చుతో అధునాతనమైన పరిజ్ఞానంతో అధునాతనమైన పరికరాలతో ప్రజలకు శస్త్ర చికిత్స, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. అనుభజ్ఞులైన డాక్టర్లు కాబట్టి పట్టణంలో అనారోగ్యంతో ఉన్నవారు దూరప్రాంతాలైన మద్రాసు, నెల్లూరుకు కాకుండా కావలిలోనే సదుపాలు ఉన్నాయని, వారిని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు, వైద్యశాల దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వారితో పాటు పాలవల్లి పద్మనాభరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడు, బత్తిన మాలకొండయ్య కావలి పట్టణ, రూరల్ ప్రాంత అన్ని రాజకీయపార్టీల నాయకులు, యువ డాక్టర్లకు స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో అన్నదానం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని గంగపట్నం పల్లి పాలెం గ్రామాలలో వైసిపి నాయకులు సిగినం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం వైసిపి నాయకులు సిగినం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి తమ గ్రామంలో గణనాథుని ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటు న్నామన్నారు. ఈ సంవత్సరం కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అమ్మ హేచరి అధినేత దుగ్గా శంకర్‌రెడ్డి, వైసిపి నేత వెంకటేశ్వర్లు, టిడిపి నేతలు బొద్దుకూరు సుధీర్, రామాని నారాయణ పాల్గొన్నారు.

రిటైర్మెంట్ ప్రకటన

మద్దినేని రమణమ్మ W/o తిరుపాల్ నాయుడు
మద్దినేని సూర్యకుమారి W/o తిరుపాల్ నాయుడు
అను ఇరువురము
శ్రీసూర్య ఆక్వాఫీడ్స్ అను ఫర్మ్ నుండి
23-09-2023 న రిటైర్ అయినాము. మాకు ఫర్మ్‌నుంచి రావలసిన క్యాపిటల్, ప్రాఫిట్స్ అన్ని మొత్తములు ముట్టినవి.మాకు ఆరోజు నుండి ఫర్మ్‌తో ఎలాంటి లావాదేవీలు లేవు. ఈ ప్రకటన ద్వారా యావన్మందికీ తెలియజేయుచున్నాను.

'సంజీవని ఆరోగ్య రథం' సేవలు

ప్రజాశక్తి-ఉదయగిరి : కాకర్ల ట్రస్ట్ ఎన్‌టిఆర్ సంజీవని ఆరోగ్య రథంతో వైద్యులు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ పరిశీలించారు. బుధవారం వింజమూరు మండలం నందిగుంట గ్రామంలో 127వ రోజు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సంజీవని ఆరోగ్య రథంతో అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 98 మందిని డాక్టర్లు వివిధ ఆరోగ్య సమస్యలను పరీక్షించారు. అలాగే 64 మంది కంటి చూపు సమస్యలను గుర్తించి మొత్తం162 మందికి చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం టిడిపి ట్రస్ట్ వ్యవస్థాపకులు వైద్య శిబిరాన్ని సందర్శించి సంజీవని ఆరోగ్య రథంతో అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తుల నుండి ఆయన అడిగి తెలుసుకున్నారు. 155వ రోజు అన్నా క్యాంటీన్‌తో 630 మంది వారి ఆకలను తీర్చుకున్నట్లు నిర్వహకులు తెలిపారు.

In the Court of the Hon'ble Family Court (VII Addl. Judge), Eluru, West Godavari Dist., F.C.O.P. No. 1/2023

Between:
Gorantla Jyotsna @ Lakshmi Jyotsna ...*Petitioner*
&
Gorantla Venkateswara Rao & Others ...*Respondents*

Steps Petition filed behalf of the petitioner Under Order-5, Rule 20 of C.P.C.

పై నంబరు గ్రంథంలో రెస్పాండెంట్ గోరంట్ల వెంకటేశ్వరరావు, S/o. లేటు గోరంట్ల రాము, ప్రైవేటు ఉద్యోగి, R/o. DSR Square Apartments, Flat No. G5, హరినాధపురం 5th Line, House No. 16/13/305, Block No. 164, Near Peoples park, నెల్లూరు 524002 అను వారికి నోటీసు అమలు కొరకు **19-10-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలపుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియచేయడమైనది.

(By Order VII Additional Judge)

ఏలూరు 25-9-2023
బి.వరహాలరావు
బి.శిరీష
అడ్వకేట్స్, ఏలూరు

CHANGE OF NAME

I, SHAIK JALEELAHMED (Old Name) Resident of D. No. 20/04/132, Khuddus Nagar, Kotamitta, Nellore-524001, AP. Here by declare that I have Changed my name as **SHAIK JALEEL AHMAD** (New Name) S/o.SHAIK KHADAR VALI.

CHANGE OF NAME

I, SHAIK RESHMA (Old Name) Resident of D. No. 20/04/132, Khuddus Nagar, Kotamitta, Nellore-524001, AP. Here by declare that I have Changed my name as **SHAIK RESHMA BEGUM** (New Name) W/o. SHAIK JALEEL AHMAD.

CHANGE OF NAME

I, SHAIK SHAJADI BEGUM (Old Name) Resident of D. No. 20/04/131, Khuddus Nagar, Kotamitta, Nellore-524001, AP. Here by declare that I have Changed my name as **SHAIK SHAJADHI BEGAM** (New Name) W/o.SHAIK KHADHAR VALLI.

CHANGE OF NAME

I, SHAIK SHAFI AHAMED (Old Name) Resident of D.No.27-1-81, 3rd Cross Road, Mosque Street, Balaji Nagar, Nellore - 524002,AP. Here by declare that I have Changed my name as **SHAIK SHAFEE AHAMED**(New Name) S/o.SHAIK KHADAR MASTHAN.